# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 245 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 26 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 245 26-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




మూడో వన్డేలో టీమ్ఇండియా ఘన విజయం

7 లో..

## 'మొంథా' తుపాను వస్తోంది...

# అప్రమత్తంగా ఉండండి..

- సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- 'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్ జారీ
- అధికారులతో సీఎం చంద్రబాబు అత్యవసర టెలీకాన్ఫరెన్స్
- ఈ నెల 28న కాకినాడ వద్ద తీరం దాటనున్న తుపాను
- గంటకు 110 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశం
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం
- తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచన




**అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై 'మొంథా' తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో 'మొంథా' తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. తీరప్రాంత ప్రజలకు తుఫాన్ తీవ్రతపై అవగాహన కల్పించి, వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే

- తరువాయి 2లో..

## దూసుకొస్తున్న..

# మొంథా తుపాను

**విశాఖపట్నం అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


మొంథా తుపాను దూసుకొస్తోంది.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న సోమవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఎపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనీ, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సీనియర్ డ్యూటీ ఆఫీసర్ జగన్నాధ కుమార్ తెలిపారు.

**మొంథా తుపాను..**

"మొంథా" గా పిలిచే ఈ తుపాను కాకినాడ సమీపంలో 28వ తేదీ సాయంత్రం తరువాత తీరం దాటుతుందని ఎపి విపత్తుల నిర్వహణా సంస్థ తెలిపింది. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో%ొ% ఇప్పటికే రెండు, మూడు రోజులుగా ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో



ఏర్పడిన అల్పపీడనం, స్థానిక వాతావరణ పరిస్థితుల వల్ల ఇలా జరుగుతుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ వర్షాలు మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. "అల్పపీడనం పశ్చిమ, వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. అది తీవ్రవాయుగుండగా మారి%ొ% 27 న అంటే సోమవారం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉంది." అని జగన్నాధ కుమార్ వివరించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో "తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లకూడదు. తదుపరి సూచనలు వచ్చేవరకు బోట్లను లంగరు వేసి ఉంచితే మంచిది," అని జగన్నాధకుమార్ తెలిపారు. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, పంటలను రక్షించే చర్యలు ముందుగానే తీసుకోవాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుపాను సమయంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. "మెరుపులతో కూడిన వర్షం, ఉరుములు పడే




- తరువాయి 2లో..

# కాకినాడ దిశగా 'మొంథా' తుపాను...

## కలెక్టర్ సూచనతో పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా!

- బంగాళాఖాతంలో మొంథా తుపాను
- కాకినాడ సమీపంలో తీరం చేరే అవకాశం
- జిల్లా కలెక్టర్ తో పవన్ కల్యాణ్ టెలీకాన్ఫరెన్స్
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం
- ఏలేరు ఆయకట్టు రైతులను ముందుగానే హెచ్చరించాలని సూచన



**అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను కాకినాడ సమీపంలో తీరాన్ని తాకే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌తో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి, కీలక సూచనలు జారీ చేశారు. తుపాను ప్రభావం ముఖ్యంగా తుని, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్ళరేవు మండలాలపై అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నట్లు ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, తీరప్రాంత గ్రామాల ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. తుపాను షెల్టర్లలో ఆహారం, మంచినీరు, మందులు, పాలు వంటి నిత్యావసరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, నీటిపారుదల, అగ్నిమాపక శాఖలతో పాటు విపత్తు నిర్వహణ బృందాలను (NDRF) సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఉప్పాడ వద్ద సముద్ర కోతకు గురయ్యే ప్రాంతంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని స్పష్టం చేశారు. ఏలేరు రిజర్వాయర్ నీటిమట్టంపై ఆరా తీయగా, రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరువలో ఉందని, గేట్లు ఎత్తే ముందు ఆయకట్టు రైతులను, ప్రజలను అప్రమత్తం చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్

- తరువాయి 2లో..

# ఆస్ట్రేలియా పర్యటన విజయవంతం...

## పూర్తి విశ్వాసంతో తిరిగి వస్తున్నా: మంత్రి నారా లోకేశ్

- మంత్రి నారా లోకేశ్ ఏడు రోజుల ఆస్ట్రేలియా పర్యటన ముగింపు
- నాలుగు నగరాల్లో విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల ప్రతినిధులతో భేటీ
- 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని స్పష్టీకరణ
- క్రీడలను కూడా ఆర్థిక వనరుగా మార్చే అవకాశం ఉందన్న లోకేశ్
- ఏపీకి ప్రయోజనకరమైన భాగస్వామ్యాలు వస్తాయని ధీమా వ్యక్తం
- నైపుణ్యాభివృద్ధి, ఆర్ అండ్ డీ రంగాలపై ప్రత్యేక దృష్టి



**అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ ఐటీ, మానవ వనరులు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తన ఏడు రోజుల ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించారు. నాలుగు నగరాల్లో సాగిన ఈ పర్యటన రాష్ట్రానికి ఎంతో ఫలవంతంగా సాగిందని, త్వరలోనే కీలక భాగస్వామ్యాలు కుదరనున్నాయని ఆయన ధీమా

- తరువాయి 2లో..




# ఈ దశాబ్దం మోడి దే : సిఎం చంద్రబాబు

ఈ దశాబ్దం మోడీ దే అని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీహార్ సిఎం నీతీష్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు.

వార్త 2లో..

## కర్నూలు బస్సు ప్రమాదంలో

# వీడిన మిస్టరీ

- బైక్ వెనుక కూర్చున్న ఎర్రిస్వామి అనే యువకుడ్ని ప్రశ్నించిన పోలీసులు
- బైక్‌ను బస్సు ఢీకొట్టలేదని తేలిన వైనం
- ముందుగా బైక్ స్కిడ్ అయి డివైడర్‌ను ఢీకొట్టిందని నిర్ధారణ
- కిందపడిన బైక్‌ను బస్సు ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగాయి
- ప్రమాదంలో 19 మంది మృతి చెందినట్లు హోంమంత్రి ప్రకటన

**అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. తొలుత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, బైక్‌ను నేరుగా ఢీకొట్టడం వల్లే మంటలు చెలరేగాయని భావించగా, పోలీసుల దర్యాప్తులో అది తప్పని తేలింది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తూ స్వల్ప

- తరువాయి 2లో..

## తుపాను నేపథ్యంలో ప్రజలకు

# అందుబాటులో ఉండాలి

### టిడిపి నాయకులు, కార్యకర్తలకు పల్లా పిలుపు

**అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



రాష్ట్రానికి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను ప్రభావం ఈ నెల 26 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉండనున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## స్లీపర్ ట్రావెల్స్.. డేంజర్ బెల్స్

ఇప్పుడు స్లీపర్ బస్సుల పేరు చెబితే భయం కలుగుతోంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం (24.10.25) తెల్లవారు జామున చెలరేగిన మంటలు అనేక మందిని సజీవ దహనం చేసిన సంఘటన స్లీపర్ బస్సుల నిర్వహణ లోపాలకు సాక్షంగా మరోసారి చర్చనీయాంశం అవుతోంది. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది ప్రాణాలు కోల్పోగా, పది రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇలాంటి ప్రమాదమే జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ప్రమాదాల కారణంగానే కొన్ని దేశాల్లో స్లీపర్ బస్సుల వినియోగాన్ని బాగా తగ్గించేశారు. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోవడంతో 2012 లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది. మన దేశంలో స్లీపర్ బస్సులు చాలా పాప్యులర్ పొందాయి. చాలా మంది ప్రయాణికులు తమ సుదీర్ఘ ప్రయాణంలో ఈబస్సుల్లో హాయిగా నిద్రపోవచ్చని ఇష్టపడుతుంటారు.

కానీ తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో వీటి భద్రతపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు సాధారణంగా స్లీపర్ బస్సుల రిజిస్ట్రేషన్లకు అధికారికంగా అనుమతించడం లేదు. కానీ చాలామంది ఆపరేటర్లు స్థానిక నిబంధనలను పక్కన పెట్టి ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్ని చోట్ల తమ బస్సులకు రిజిస్ట్రేషన్లు చేయించి ఈ రాష్ట్రాల్లో నడుపుతున్నారు. ఈ వక్ర మార్గాలు నిజంగా భద్రతా ప్రమాణాలు అమలవుతున్నాయా లేదా అన్న సందేహాలకు దారితీస్తున్నాయి. ఘోర ప్రమాదాలకు దారి తీస్తున్న స్లీపర్ బస్సుల భద్రత ప్రమాణాలను కట్టుదిట్టం చేయడం ప్రభుత్వ అధికారుల ప్రస్తుత కర్తవ్యం. భద్రతా ప్రమాణాలతో ఫ్యాక్టరీలో తయారైన బస్సులనే రోడ్లపైకి అనుమతించాలి. అత్యధిక లాభాల కోసం అనధికారికంగా బస్సుల డిజైన్లను ఆపరేటర్లు మార్చకుండా నియంత్రించాలి. అలాగే రెగ్యులర్‌గా వీటిపై తనిఖీలు జరగాలి. స్లీపర్ బస్సుల్లో ఓవర్ లోడ్‌ను అనుమతించరాదు.

ఎన్ని సౌకర్యాలు ఉన్నా ప్రాణాలకు రిస్కుగా మారకూడదు. బస్సుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే పొగకమ్ముకోవడం ప్రయాణికులకు ఊపిరాడక వెంటనే తప్పించుకునే దారి కనిపించడం లేదు. ఈలోగా జరగవలసిన నష్టం జరిగిపోతోంది. స్లీపర్ బస్సులో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా తప్పించుకునే ఏర్పాట్లు ఎంతవరకు ఉన్నాయో మొదట తప్పనిసరిగా పరిశీలించుకోవడానికి బదులు కేవలం తమ సౌకర్యాలపైనే ప్రయాణికులు దృష్టి పెడుతున్నారు. మొదట్లో కొన్ని మాత్రమే స్లీపర్ బస్సులుండేవి. అయితే ట్రావెల్ ఆపరేటర్లు చాలామంది తమ మామూలు సీటింగ్ బస్సులను కూడా స్లీపర్ కోచ్‌లుగా మార్చేసి అత్యధికంగా ఛార్జీలు పిండుకోవడం ప్రారంభించారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలతో తయారైన బస్సులను ప్రైవేట్‌గా తమ ఇష్టం వచ్చినట్టు ఆపరేటర్లు వాటి డిజైన్ మార్చేయడం పరిపాటి అయింది. బస్సు కిటికీలు తరచుగా మూసి ఉంటాయి. బస్సులో టివి స్క్రీన్లు, మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్ కనెక్షన్లకు ఛార్జింగ్ చేసుకునే సౌకర్యం తదితర హంగులు ఉండడంతో పవర్ లోడ్ అధికమై షార్టు సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగే ప్రమాదాలు ఎదురవుతుంటాయని కొందరు ప్రయాణికులు చెబుతుంటారు.

బస్సులో ప్రవేశించడానికి, బయటకు రావడానికి ఒకే ద్వారం తెరిచి ఉంటుంది. సాధారణంగా వీటి ఎత్తు 8 నుంచి తొమ్మిది అడుగుల వరకు ఉండడంతో బస్సు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల నుంచి బయటపడడం కష్టమవుతోంది. ఈ బస్సుల్లో 30 నుంచి 36 వరకు బెర్తులు ఉంటాయి. ఒక్కో బెర్తు 6 అడుగుల పొడవు, 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. ఈ బెర్తులను అనుసంధానించే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండడమే అసలు సమస్య. రాత్రివేళల్లో ఇవి అత్యంత స్పీడ్‌తో వెళ్తుండడం డ్రైవర్లకు అగ్నిపరీక్షే. డ్రైవర్లకు ఏమాత్రం అలసట వచ్చినా, మగత కమ్మినా ప్రమాదాలకు దారితీస్తుంటాయి. రాత్రుళ్లు డ్రైవింగ్ సమయంలో 25 శాతం మంది నిద్రమత్తులో ఉంటున్నట్టు 2019 లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల లోపు డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఈ ధోరణిని అరికట్టడానికి కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతిక వ్యవస్థలను కొన్ని నగరాల్లో వినియోగిస్తున్నారు.

పుణె వంటి నగరాల్లో డ్రైవర్లు మగతగా ఉన్నారా లేదా పరధ్యానంలో ఉన్నారా లేదా సిగ్నల్ దాటుకుని స్పీడ్‌గా వెళ్తున్నారా? అని పసికట్టి హెచ్చరించే స్మార్ట్ కెమెరాలు వినియోగిస్తున్నారు. డ్రైవర్ ఎన్నిసార్లు కనురెప్పలు మూస్తూ తెరుస్తూ ఉన్నాడో, తరచుగా వాహనం ఎన్నిసార్లు అదుపు తప్పిందో తెలిసిపోతుంది. రెడ్ లైట్ సిగ్నల్ వద్ద డ్రైవర్ ఏ విధంగా అజాగ్రత్తగా వ్యవహరిస్తునాడో పసిగడతాయి. అలాంటి సమయాల్లో కీచుమని శబ్దం రూపంలో, మరికొన్ని సార్లు స్టీరింగ్ వీల్ ప్రకంపించడం ద్వారా హెచ్చరికలు వస్తుంటాయి. ఇటువంటి ఎఐ వ్యవస్థ డ్రైవింగ్ అవర్స్‌ను ట్రాక్ చేయడమే కాదు, వారు స్మార్ట్‌గా డ్రైవ్ చేయడానికి సహాయపడుతుంది. ఇప్పుడు కొత్తగా బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా వాటి పనితీరు సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉంటున్నాయి. కృత్రిమ మేధ సాయంతో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఢిల్లీ గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేయడం చెప్పుకోతగ్గ విశేషం. దీంతో దేశం లోనే మొట్టమొదటి ఎఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. ఈ ప్రక్రియను దేశ వ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై అమలు చేయడానికి కేంద్రం యోచిస్తోంది.

# ఈ దశాబ్దం మోదీదే..

## ఏపీ సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు.




కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. "భారత్‌లో ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రధాని మోదీ 2000 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఎన్నికల్లో విజయం సాధిస్తూనే ఉంటారు. గతంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు ఆయనే ఉంటారు. ఈ దశాబ్దం మోదీదే. అంటే ఆటోమెటిగ్గా భారతీయులదే" అని చంద్రబాబు వెల్లడించారు.

### గ్లోబల్ లీడర్లుగా తెలుగు ప్రజలు

ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు మాట్లాడారు. వాటివల్ల ప్రజల సేవింగ్స్ పెరుగుతాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగం, ఇతర వ్యాపారవేత్తలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ దేశ తలసరి ఆదాయంలోనైనా ఆ దేశంలో నివసించే భారతీయులదే ఆధిపత్యం అని ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. వచ్చే నెలలో ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు ఆంధ్రాలో శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, ఉద్యానరంగం, లాజిస్టిక్స్, రాజధాని నగరం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 750 వరకు సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామంటూ రియల్ టైమ్ గవర్నెన్స్ గురించి పేర్కొన్నారు. అలాగే తెలుగు కమ్యూనిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుందని, ఆ దిశగా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిందని, మరో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# రైతన్నల పరిస్థితి అగమ్యగోచరం

## ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కూటమి పాలనలో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు రాష్ట్రంలో 1.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆపన్న హస్తం అందించాల్సిన కూటమి ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఆరుగాలం పడ్డ శ్రమ కళ్లముందే నీళ్లపాలవుతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. సిఎం చంద్రబాబుకు ఐటి మీదున్న శ్రద్ధ రైతాంగంపై లేదన్నారు. అన్నదాతకు భరోసా అనేది అంతా బూటకమేనన్నారు. రైతన్నలకు జరిగిన అపార నష్టంపై ఉన్నత స్థాయి సమావేశాన్ని వెంటనే జరపాలని, తక్షణమే రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# ఏపీలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్..

## ట్రావెల్స్ బస్సులపై 289 కేసులు

అమరావతి అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా ఏపీలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాలపై విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై 289 కేసులు నమోదు చేశారు. 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి రూ.7.08 లక్షల జరిమానాలు విధించారు. అత్యధికంగా ఏలూరులో 55 కేసులు నమోదు చేశారు. 3 ట్రావెల్స్ బస్సులు సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు చేసి.. 4 బస్సులు సీజ్ చేశారు. కోనసీమ జిల్లాలో 27, చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12, విశాఖలో 7, నంద్యాలలో 4 కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేవని 8 బస్సులు, అత్యవసర ద్వారం లేదని 13 బస్సులపై కేసులు ఫైల్ చేశారు. అగ్నిమాపక పరికరాలు లేవని 103 బస్సులపై, ప్యాసింజర్ లిస్టు లేని కారణంగా 34 బస్సులపై, ఇతర ఉల్లంఘనలపై 127 కేసులు నమోదు చేశారు. ప్రత్యేక డ్రైవ్ రోజూ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# అప్రమత్తంగా ఉండండి..

ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకే అప్పగించారు. అన్ని ప్రధాన, మధ్య తరహా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి విడుదలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి, సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలన్నారు. కాకినాడలో 'హాస్పిటల్ ఆన్ వీల్స్' సేవలను అందుబాటులో ఉంచాలని ప్రత్యేకంగా సూచించారు. ఆర్ అండ్ బీ, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్స్, నిత్యావసరాల పంపిణీ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాలకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జి అధికారులను నియమించి, క్షేత్రస్థాయిలో నష్ట నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

# దూసుకొస్తున్న.. మొంథా తుపాను

అవకాశం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర, హోర్డింగ్‌లు ఉన్న ప్రదేశాల్లో నిలవకండి. ఎలక్ట్రానిక్ పరికరాలను ప్లగ్‌లో ఉంచకూడదు" అని అధికారులు జాగ్రత్తలు సూచించారు.

**సోషల్ మీడియా వదంతులను నమ్మకండి : హోం మంత్రి అనిత**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడనుందన్న వాతావరణ హెచ్చరికలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభావిత జిల్లాల కలెక్టర్లలతో అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం నుండి హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 112, 1070, లేదా 1800-425-0101 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాపించే వదంతులను నమ్మకుండా, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు.

# కాకినాడ దిశగా 'మొంథా' తుపాను...

వివరించారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల రైతులు, ప్రజలకు ముందస్తు సమాచారం అందించేలా నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాగా, తుపాను హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించేందుకు పవన్ కల్యాణ్ కాకినాడ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రస్తుతం యంత్రాంగం మొత్తం సహాయక చర్యల సన్నద్ధతలో నిమగ్నమై ఉన్నందున పర్యటనను వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ సున్నితంగా కోరడంతో ఆయన తన పర్యటనను వాయిదా వేసుకున్నారు.

# ఆస్ట్రేలియా పర్యటన విజయవంతం...

వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, చర్చలు ఫలించి ఏపీకి మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటన ముగిసిన సందర్భంగా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారు. "విశ్వవిద్యాలయాలు, ప్రముఖ పరిశ్రమలు, ఇండియా-ఆస్ట్రేలియా కౌన్సిళ్లు, సీఫుడ్ వాణిజ్య సంస్థలు, క్రీడా సముదాయాల ప్రతినిధులతో సమావేశమయ్యాను. ఈ పర్యటన ఎంతో లోతైన అవగాహనను ఇచ్చింది" అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని, అందుకు అనుగుణంగా మానవ వనరులను బలోపేతం చేయడం, పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాన్ని ప్రోత్సహించడం, నైపుణ్యం గల యువతను తయారు చేయడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో క్రీడారంగానికి ఉన్న ఆర్థిక ప్రాధాన్యతను కూడా గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. క్రీడలను కేవలం వినోదంగానే కాకుండా, బలమైన ఆర్థిక కార్యకలాపాలుగా మార్చడంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో జరిపిన చర్చలు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు అర్థవంతమైన భాగస్వామ్యాలుగా మారతాయనే పూర్తి విశ్వాసంతో తిరిగి వస్తున్నానని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ

గాయాలతో బయటపడిన ఎర్రిస్వామిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఇద్దరూ బైక్‌పై లక్ష్మీపురం నుంచి రాత్రి 2 గంటలకు బయలుదేరారు. ఎర్రిస్వామిని ఇంటి వద్ద దించేందుకు శివశంకర్ తుగ్గలి బయల్దేరాడు. మార్గమధ్యంలో కియా షోరూం వద్ద ఓ పెట్రోల్ బంకులో ఇంధనం నింపుకున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొద్దిసేపటికే వారి బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. వేగంగా కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన ఎర్రిస్వామి, రోడ్డుపై ఎగిరిపడిన తన స్నేహితుడిని, రోడ్డు మధ్యలో ఉన్న బైక్ ను పక్కకి తీయాలని అనుకున్నాడు. శివశంకర్‌ను రోడ్డు పక్కకు లాగేందుకు ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న వారి బైక్‌ను చాలాదూరం ఈడ్చుకెళ్లింది. దాంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు మంటల్లో చిక్కుకోవడం చూసిన ఎర్రిస్వామి భయపడి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లిపోయాడు. కాగా, ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత నిన్న ప్రకటించిన విషయం విదితమే. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా భావించినా, ఎర్రిస్వామి వాంగ్మూలంతో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చింది.












## ముగిసిన చంద్రబాబు

# యూఏఈ పర్యటన

మూడు రోజుల యూఏఈ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు. మూడో రోజున అక్కడి తెలుగు ప్రజలతో నిర్వహించిన డయాస్పొరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గల్ఫ్‌లోని పది దేశాల నుంచి సుమారు 2500 మంది వరకు వారి కుటుంబాలతో కలిసి వచ్చారు. ఉత్సాహంగా డయాస్పొరా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారందరితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓపిగ్గా ఫోటోలు దిగారు.
















## కుడుపూడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అయితాబత్తుల పరామర్శ



**అమలాపురం అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల మరణించిన పాలగుమ్మి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుడుపూడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు . DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, మాజీ %ఎజూజూ% బొర్రా ఈశ్వరరావు, దేవరపల్లి వీరేష్ కుమార్, చంటి రాజు, మల్లుల రామకృష్ణ, దంగేటి వెంకటేశ్వరరావు, ఈతకోట నాగేశ్వరరావు, పచ్చిమాల ఏడుకొండలు, కాట్రు కృష్ణ, అవుపాటి గోపాల్, బుడితి రాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

## పొన్నాడ జగన్నాథ రావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అయితాబత్తుల పరామర్శ



**అమలాపురం అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల మరణించిన పొన్నాడ జగన్నాథ రావు కుటుంబ సభ్యులను పరామర్శించడం గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు. DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, ఈతకోట నాగేశ్వరరావు, అవుపాటి గోపాల్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

## గుండుమొగుల మణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



**అమలాపురం అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల మరణించిన కొంకాపల్లి కి చెందిన గుండుమొగుల మణి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆనందరావు. DCMS చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు,గుండుమొగుల బాలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు



## జిల్లాలో గంజాయి వినియోగం అనే మాట ఎక్కడ వినిపించకూడదు
### కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

యువత, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు లోబడకుండా చూసే ప్రధాన బాధ్యతను ఎక్సైజ్ అధికారులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సురక్ష యాప్ వినియోగం, ప్లాస్టిక్ నిషేధం, గంజాయి ఇతర మత్తు పదార్థాల తనిఖీలు, ఎక్సైజ్ శాఖ ప్రగతి తదితర అంశాలపై ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాజు మాట్లాడుతూ కల్తీ అక్రమ మద్యాన్ని పూర్తిగా నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు సురక్ష యాప్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, వినియోగదారులు సురక్ష యాప్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారుడు సురక్ష యాప్ ద్వారా బాటిల్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే నోటిలకు సంబంధించిన తయారీ, బ్యాచ్ నెంబర్, తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు అన్న. కలెక్టర్ స్వయంగా బాటిల్ పై క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి బాటిల్ మీద వివరాలను, స్కానింగ్ వివరాలను సరిపోల్చి పరిశీలించారు. జిల్లాలో గంజాయి వినియోగం అనే మాటే వినిపించకూడదని, ఉక్కు పాదం మోపాలని ఎక్సైజ్ అధికారులను గట్టిగా హెచ్చరించారు. జిల్లాలో గంజాయి, తదితర మత్తు పదార్థాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, కళాశాలలో ప్రిన్సిపాల్స్ ను, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను తరచూ కలిసి వివరాలను తెలుసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థి డల్ గా ఉంటున్నాడా, తరచూ తరగతులకు గైరు హాజరు అవుతున్నారా, ప్రవర్తనలో ఏమైనా తేడాలు ఉన్నాయా, వారు దృష్టికి ఏమైనా ముత్తు పదార్థాలు వినియోగం సమాచారం వచ్చిందా తదితర విషయాలను కూలంకషంగా తెలుసుకోవాలన్నారు. మద్యం షాప్లు, బార్లు వద్ద మూడు శాతం ప్లాస్టిక్ నిషేధం అమలు జరిగేలా పర్యవేక్షించాలి




అన్నారు. జిల్లాలో 2025 జనవరి నుండి అక్టోబర్ 24, 2025 వరకు 442 అక్రమ మద్యం కేసులను నమోదు చేసి 442 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరి వద్ద 616.39 లీటర్ల మద్యాన్ని, 13 లీటర్ల బీరును స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. సుంకం చెల్లించని మద్యం పైన కూడా దృష్టి సారించాలన్నారు. ఏలూరు జిల్లా ఆబ్కారీ సహాయ కమిషనర్ మరియు ఇన్చార్జి జిల్లా మధ్య నిషేధం మరియు ఆబ్కారీ అధికారి కెవిఎన్ ప్రభు కుమార్ మాట్లాడుతూ ఈ నెల అక్టోబర్ 12న తణుకు మూడో వార్డు పాలంగి రోడ్ లో ద్విచక్ర వాహనంపై గంజాయితో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించడం జరిగిందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా, ఒక వ్యక్తి ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ను తోచివేసి పారిపోవడం జరిగిందని, హెడ్ కానిస్టేబుల్ కు ప్యాక్చర్ కూడా అయిందని తెలిపారు. వీరి వద్ద ఉన్న ఐదు కేజీల గంజాయిని, స్కూటీని సీజ్ చేయడం జరిగిందని, త్వరలో పారిపోయిన వ్యక్తిని కూడా పట్టుకుని అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఆబ్కారీ సహాయ కమిషనర్ మరియు ఇన్చార్జి జిల్లా మధ్య నిషేధం మరియు ఆబ్కారీ అధికారి కెవిఎన్ ప్రభు కుమార్, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి ప్రసాద్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ సిఐ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్.హెచ్.ఓలు కె.బలరామరాజు, ఎం.శ్రీనివాసరావు, స్వరాజ్యలక్ష్మి, ఎస్.రాంబాబు, మణికంఠ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

## కూటమి ప్రభుత్వంలో మహిళలపై పెరిగిన అత్యాచారాలు - -ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ బస్సుల ప్రమాదాలు

**రాజమహేంద్రవరం అక్టోబర్ 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎం.పి. మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులపై దాడులు, మానభంగాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. కూటమి నాయకులు మైనర్ బాలికలను లోబరుచుకొని తీసుకువెళ్లి రేప్ చేసిన సంఘటనలు ఎన్నో జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు చూసి బాధ వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల తమ ఆడపిల్లలకు ఇలాంటి సంఘటనలు జరిగితే సహిస్తారా? అని ప్రశ్నించారు. మైనర్ బాలికలపై తుని లోను, రాజమండ్రి లోను అత్యాచారాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. రాజమండ్రిలో హాస్టల్ లో చదివే బాలికలు సాయంత్రం 5.30 గంటలకు తీసుకెళ్లి ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ సంఘటనపై ప్రభుత్వం గానీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం శోచనీయం అని అన్నారు. ఈ సంఘటనపై బీసీ హాస్టల్ వద్ద ధర్నా చేస్తే తమపై కేసులు పెట్టి అరెస్టులు చేశారని అన్నారు. ఈ సంఘటన తో కడుపు తరుక్కుపోయిన మహిళ హాస్టల్ ఎదురుగా ఉన్న ఎమ్మెల్యే పోస్టర్ కు పేడ రాస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. వైసిపి నాయకురాలు అను యాదవ్ ఇంటికి 10 మంది పోలీసులు వెళ్లి హడావిడి సృష్టించారని తాను వెళ్ళితే తనతో కూడా వాగ్వాదానికి దిగారని వివరించారు. ఈవీఎం ఎమ్మెల్యే ఏమైనా దేశ నాయకుడా, స్వతంత్ర సమరయోధుడా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై కక్ష సాధింపు తో అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 41 సీ నోటీస్ ఇచ్చి 26వ తేదీన విచారణకు రమ్మని చెప్పి పంపారని, వెళ్లిపోతున్న తమను మళ్లీ త్రీ టౌన్ సిఐ వచ్చి పోలీసు స్టేషన్ లోపలికి రమ్మంటూ మరలా తీసుకెళ్లారని పేర్కొన్నారు. పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులపై పోలీసుల వేధింపులకు ఇది నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో ఒకసారి గమనించాలని ప్రజలను కోరారు. రాజమండ్రిలో నకిలి మద్యం వ్యవహారానికి సంబంధించి ఈవీఎం ఎమ్మెల్యే బినామీ ఆడియో బయటికి వచ్చిందని, దానిపై చర్యలు లేవని అన్నారు. గోదావరి జిల్లాలో పేకాట సర్వసాధారణం అని డిప్యూటీ స్పీకర్ మాట్లాడటం దారుణం పేర్కొన్నారు. రాజమండ్రిలో మద్యం ఇసుక, మట్టి, భూసెటిల్మెంట్లు, పేకాటకు క్లబ్బులు ఒకటేమిటి అన్ని రకాల దారుణాలు ఈవీఎం ఎమ్మెల్యే అండదండలతో సాగుతున్నాయని ఆరోపించారు. కర్నూల్లో ప్రమాదానికి గురైన వోల్వో బస్సుకు ఏడాదిన్నరగా ఫిట్నెస్ సర్టిఫికెట్ లేదని తెలిపారు. అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ పై తనిఖీలు చేపడితే రాష్ట్రంలో లక్షల వాహనాలకు ఫిట్నెస్ లేని విషయం బయటపడుతుందని అన్నారు. 19 మంది ప్రాణాలు పోవటానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. ప్రమాదానికి గురై బస్సుకు ఇన్సూరెన్స్ లేదని, 16 ఈ చలనాలు ఉన్నాయని చెప్పారు. ఈ సంఘటనను సుమోటాగా తీసుకొని సుప్రీంకోర్టులో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాట్లాడేవన్నీ పచ్చి అబద్ధాలని చంద్రబాబు సీఎం కావడానికి ముందే సత్యానాదెళ్ళ మైక్రోసాఫ్ట్ లో ఉన్నారని వివరించారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ గూగుల్ డేటా సెంటర్ కు సంబంధించి తన మాటల్లో ఎక్కడ చంద్రబాబు పేరు ప్రస్తావించలేదని అన్నారు. ఆదాని డేటా సెంటర్ నోయిడాలో కూడా ఉందని అక్కడ కూడా గూగుల్ పార్టనర్ షిప్ తోనే నడుస్తుందని తెలిపారు. ఈనెల 28వ తేదీన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమం చేపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా ఉద్యమం పోస్టర్ ను మాజీ ఎంపీ భరత్ రామ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఆవిష్కరించారు.




## పోలవరంలో ఘనంగా నాగేంద్రుని పూజలు



**పోలవరం, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలంలో నాగుల చవితి సందర్భంగా శనివారం ఉదయాన్నే లేచి స్థానం ఆచరించి భక్తిశ్రద్ధలతో ప్రసాదాలు చేసి ఉదయం నుండి పుట్టలు వద్ద పూజలు చేస్తున్న భక్తులు తెల్లవారుజాము నుండి పొలాలు, రోడ్డు ఇరుపక్కల ఉన్న పుట్టల వద్దకు భక్తులు చేరుకుని పూజలు చేస్తున్నారు. ఆ నాగేంద్రుడికి ఇష్టమైన ఆవు పాలు, కోడిగుడ్లు, పచ్చి తేగా, నువ్వులతో తయారుచేసిన చిమిలి, బియ్యం పిండితో చేసిన చలిమిడి, వడ పప్పు, అరటిపండు లాంటివి పుట్ట వద్దకు తీసుకువస్తారు. భక్తులు చేస్తున్న నాగేంద్రుడికి పూజ చేస్తున్న పుట్ట వద్ద నీళ్లతో శుభ్రపరిచి చక్కగా ముగ్గుతో అలంకరించి తీసుకు వచ్చిన ప్రసాదాలను పుట్టలో వేసి ఆ నాగేంద్రుడికి నమస్కారం చేసుకుంటారు. తెలిసి తెలియక ఏమైనా తప్పులు ఉంటే క్షమించు. మాపై ఉన్న దోషాలను తొలగించు అంటూ ఆ నాగేంద్రుడి చుట్టూ తన కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు మూడుసార్లు ప్రదక్షిణలు చేసి నమస్కారం చేస్తారు. అనంతరం ఆ నాగేంద్రుడు ఆనందపడేలా టపాసులు పేల్చి పిల్లలు కూడా ఆయనతో పాటు ఆనందపడతారు. ఇలా నాగుల చవితి పండుగను పోలవరం మండలంలో ఘనంగా చేసుకుంటారు. అనంతరం ఇంటి దగ్గర నుండి తీసుకువచ్చిన పిండి వంటలు పులిహోర కుటుంబ సభ్యులు ఒకచోట కూర్చొని కార్తీక్ మాసంలో వనభోజనాల, ఆటపాటలతో ఆనందిస్తారు ఇలా నాగుల చవితిని జరుపుకుంటారు.

## న్యాయశాఖపై అవగాహన సదస్సు




**చింతలపూడి, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేకరి):** నామవరం గ్రామంలో న్యాయ అవగాహన సదస్సును శనివారం న్యాయ శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి మధు బాబు, చింతలపూడి సిఐ క్రాంతి కుమార్, ఎస్ఐ సతీష్ కుమార్ హాజరయ్యారు. నామవరం గ్రామ ప్రజలకు చట్టాలపై, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మాట్లాడుతూ చట్టాలపై ప్రాథమిక అవగాహన సాధారణ ప్రజలు తెలుసుకోవాల్సిన ప్రాథమిక చట్టాలు, ముఖ్యంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీస్, న్యాయ వ్యవస్థ పాత్ర, పోలీసులు, న్యాయస్థానాలు ప్రజలకు ఎలా సహాయపడతాయి. కేసు నమోదు ప్రక్రియ ఎలా ఉంటుంది. న్యాయం పొందడానికి అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఉచిత న్యాయ సహాయం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాలను, మరియు అందుకోసం సంప్రదించాల్సిన అధికారులను గురించి వివరించారు. తక్షణ పరిష్కారం చిన్నపాటి వివాదాలు లేదా తగాదాలను కోర్టుల వరకు తీసుకువెళ్లకుండా, గ్రామస్థాయిలో లేదా లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల కలిగే సమయం, డబ్బు ఆదా గురించి తెలిపారు. చింతలపూడి సిఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని, తద్వారా న్యాయపరమైన మార్గంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. చింతలపూడి ఎస్సై సతీష్ కుమార్ మాట్లాడుతూ న్యాయ సదస్సు గ్రామస్థులలో చట్టాలపై మరియు న్యాయ ప్రక్రియపై అవగాహనను పెంచడానికి ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయిని దుర్గాబాయి కన్నుమూత





**టీ. నర్సాపురం, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1976 నుండి దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసిన నంబూరి చిన్నికృష్ణ (కృష్ణ మాస్టారు) దుర్గాబాయి దంపతులలో ఒకరైన ఉపాధ్యాయిని దుర్గాబాయి మాతంగి (81) శుక్రవారం రాత్రి చింతలపూడిలోని వారి నివాసంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు వారి కుమారుడు రత్నాకర్ తెలిపారు. ఈ దంపతులు అలనాటి టి. నరసాపురం ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుపరిచితులు ప్రత్యేకించి కృష్ణ మాస్తారు విద్యార్థిని, విద్యార్థులకు చదువు పైనే కాకుండా కళల పట్ల కూడా ఆసక్తిని పెంచే విధంగా ఆయన విద్యా బోధన ఉండేది. 31 ఏళ్ల క్రితమే కృష్ణ మాస్టారు కాలం చేయగా శుక్రవారం రాత్రి దుర్గాబాయి చనిపోయారన్న వార్త పలువురు పూర్వ విద్యార్థులను, బంధుమిత్రులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పాఠశాల ఉపాధ్యాయులు గానే గాక అందరితో చక్కటి స్నేహ సంబంధాలు కొనసాగించేవారు. ఉపాధ్యాయులుగా పదవీ విరమణ అనంతరం వారు చింతలపూడిలో సొంత ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వారికి ఒక మగ, ఆరుగురు ఆడపిల్లలు. ఏకైక కుమారుడు పెద్దవాడు రత్నాకర్, కుమార్తెలు భారతి, ఇందిరా, విశ్వశాంతి, (మెర్రీ) సుభాషిని, పద్మ, కాంచనమాల ఆడపిల్లలందరూ ఉన్నత చదువులు చదివి స్వయంకృషితో ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు. పలువురు పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు దుర్గాబాయి మృతికి నివాళులర్పించి సంతాపం తెలియజేయడంతో పాటు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అక్షరం మనిషికి మంచి లక్షణాన్ని నేర్పుతుందని జీవితంలో చీకటిని పారదోలి వెలుగును నింపే ఒకే ఒక్క ఆయుధం క్రమశిక్షణతో కలిగిన చదువు మాత్రమే నని మనసా వాచా కర్మణా నమ్మి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా దిద్దిన అక్షర శిల్పి అందరితో స్నేహ సంబంధాలు కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యుల ఉన్నతికి జీవితకాలం సేవ చేసిన మానవతా మూర్తి దుర్గాబాయి లేని లోటు ఎవరూ తీర్చలేనిదని వారి సేవలు చిరస్మరణీయమని టీ. నర్సాపురంకి చెందిన సామాజిక కార్యకర్త, పూర్వ విద్యార్థి, కుటుంబ మిత్రులు యస్ డి నా సర్ పాషా, ప్రముఖ కవి రచయిత పాత్రికేయులు మరీదు నాగేశ్వరరావు కొనియాడారు.

## న్యాయవాదుల హక్కులు హరించే కుట్రపై వ్యాజ్యం దాఖలు

### -ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా)



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సామాన్యులు పోటీ చేయకుండా ఖరీదైన ఎన్నికలుగా మార్చే కుట్రను ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (అలా) అధ్యక్షులు ఎమ్.వి. రాజారామ్, ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ సంయుక్తంగా వ్యతిరేకించారు. బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థి రుసుమును రూ.1,25,000 కు పెంచడం వల్ల లాయర్స్ ఇబ్బందులు పడుతున్నారని, పైగా నాన్ రిటర్నబుల్ ఎమౌంట్ గా మార్చేశారని, ఒక కార్పొరేట్ వ్యాపార లాభదాయక పరిశ్రమగా బార్ కౌన్సిల్ ఎన్నికలను కలుషితం చేయటం బాదాకారం అన్నారు. ఈ కుట్ర చర్య న్యాయవాదుల భద్రత, సంక్షేమం , భవిష్యత్ పై కాల కూట విషం చిమ్మటం వంటిది అని అభ్యర్థి రుసుమును రూ.2000 లకు కుదించమని అమాంతం పెంచిన రూ.1,25,000 రుసుమును రద్దు చేయమని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది ఎమ్. వి. రాజారామ్, న్యాయవాది మేడా శ్రీనివాస్ ఏపి హైకోర్టులో వాజ్యం దాఖలు చేసారు.

## మంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు హెచ్చరికలు జారి చేసిన ఐటిడిఏ అధికారి



**చింతూరు, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమీపిస్తున్న మంతా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ, డివిజన్ పాలనా యంత్రాంగం, సంబంధిత విభాగాలు పూర్తి అప్రమత్తతతో ఉన్నాయి. తాజా వాతావరణ నివేదికల ప్రకారం, ఈ మంతా తుఫాన్ వచ్చే రెండు రోజులలో తీర ప్రాంతాలను తాకే అవకాశం ఉంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మంతా తుఫాన్ ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంది. తీరప్రాంత ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, వైద్య శాఖ, పోలీస్ విభాగాలు అన్ని అత్యవసర పరిస్థితుల కోసం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్: 9490026397 / 8121729228 (చింతూర్ సబ్ కలెక్టర్ ఆఫీసు కంట్రోల్ రూమ్) నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని ఐటిడిఏ అధికారులు సూచించారు.తుఫాన్ సమయంలో విద్యుత్ తీగలు, చెట్లు లేదా కూలిన భవనాల దగ్గరికి వెళ్లకుండా ఉండాలని, రాత్రి సమయాల్లో ప్రయాణాలు చేయవద్దని, ఇళ్లలో సురక్షితంగా ఉండాలన్నారు. విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు వంటి సున్నిత వర్గాలకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపాతం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నదులు, చెరువులు, వాగులు దాటవద్దని హెచ్చరించారు. మంతా తుఫాన్ సమయంలో ఎవరు కూడా చేపల వేటకు వెళ్లరాదన్నారు . తూఫాన్ సమయంలో ఎవరు కూడా రోడ్ బ్లాక్ పాయింట్ లను దాటవద్దని అధికారుల సూచించారు. ప్రతి మండలంలో తహశీల్దార్, ఎస్ ఐ , ఎంపిడిఓ, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంగా పనిచేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ , పోలీస్, వైద్య, విద్యుత్, సచివాలయం సిబ్బంది మంతా తుఫాన్ నియంత్రణ చర్యల్లో పాల్గొంటున్నారు. మంతా తుఫాన్ సమయంలో ఏదైనా అత్యవసరం అయినచో మండల తహశీల్దార్/ మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్/ స్టేషన్ హౌస్ మాస్టర్ ను సంప్రదించవచ్చు అని ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా, అధికారుల సూచనలను పాటించాలి. అసత్య వార్తలు లేదా సోషల్ మీడియాలో వస్తున్న రూమర్లను నమ్మవద్దు. అధికారిక సమాచారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం లేదా స్థానిక అధికారుల ప్రకటనలను మాత్రమే నమ్మాలని కోరారు. అదే విధంగా ఆంధ్రా ప్రదేశ్ వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల ప్రకారం, రానున్న మంతా తుఫాన్ ప్రభావం దృష్ట్యా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత నిమిత్తం వి.ఆర్ పురం మండలం లో గల పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. పర్యాటకులు, బోటు యాజమాన్యం, బోటు సిబ్బంది, స్థానిక ప్రజల గమనించగలరు. అలాగే పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ మరియు టూరిజం శాఖల అధికారులకు ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని, ఎటువంటి అనధికార బోటు ప్రయాణాలను అనుమతించరాదని సూచించారు.

చింతూర్ డివిజన్ నందు మండల హెడ్ క్వార్టర్స్ టోల్ ఫ్రీ నంబర్స్:
కూనవరం కంట్రోల్ రూమ్: 9652814712.
వీఆర్ పురం కంట్రోల్ రూమ్: 8008100892, చింతూరు కంట్రోల్ రూమ్: 9492527695
%౨%) ఏటపక కంట్రోల్ రూమ్: 8332085268 ఏర్పాటు చేశారు.

## సిబ్బంది కొరతతో ప్రజలకు ఇబ్బందులు




**చింతలపూడి, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):** నగర పంచాయతీలో సిబ్బంది కొరత తీవ్రంగా కనిపిస్తోంది. సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్లు, అడ్మిన్ సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు స్కాలర్షిప్లు, పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన వివిధ రకాల సర్టిఫికెట్లు సచివాలయాల ద్వారానే జారీ చేయాల్సి ఉంటుంది. అయితే సచివాలయాలకు వెళ్లే తల్లిదండ్రులు, విద్యార్థులు డిజిటల్ అసిస్టెంట్ లేదా అడ్మిన్ లేని కారణంగా తిరస్కరించబడుతున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. దారిద్య రేఖకు దిగువనున్న వారికి జారీ చేయాల్సిన రేషన్ కార్డులు, రైతులకు అవసరమైన రెవెన్యూ సర్వీసులు 1బి అడంగల్, ఇతర సర్టిఫికెట్లు కూడా సిబ్బంది కొరత వల్ల జాప్యం అవుతున్నాయి. నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ తగిన సిబ్బందిని నియమించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని అన్ని సచివాలయాలకు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

### -పుట్టలో పాలు పోసి పూజలు చేసిన గొర్రెల శ్రీధర్ కుటుంబం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 25(తెలుగురాష్ట్రం విలేకరి):** నాగుల చవితి పండుగను భక్తులు శనివారం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే లేచి తలంటు స్నానాలు చేసి దేవాలయాలు, పొలాల్లోని పుట్టలు వద్ద చలివిడి, చిమిలి, అరటి పండ్లు, గుడ్లు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పుట్ట వద్దకు వెళ్లి నాగేంద్ర స్వామి కి పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి,నాగేంద్ర స్వామికి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ రైతులందరూ వారివారి వ్యవసాయ క్షే త్రాల్లో పనులు నిర్వహించుకునే సమయాల్లో వారికి ఎటువంటి హాని తలపెట్టకుండా, వారు, వారి కుటుంబ సభ్యులు మరియు భక్తులు అందరికి కూడా నాగేంద్ర స్వామి కరుణ, కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, పట్టణ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని ఆ స్వామివారిని వెదుకున్నానని తెలిపారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

## ఎల్.టి.ఆర్ కేసుల పరిష్కారం కోసం ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చెయ్యాలి

### న్యాయవాది మడివి రవితేజ



**చింతూరు, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఎల్.టి.ఆర్ కేసులు, ఏజెన్సీ భూ సమస్యల పరిష్కారం కోసం చింతూరు ఐ.టి.డి.ఏలో ట్రైబల్ న్యాయవాదులతో కూడిన లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని న్యాయవాది మడివి రవితేజ కోరారు. చింతూరు ఐ.టి.డి.ఎ. అధికారులు ఎల్.టి.ఆర్ కేసుల ఫిర్యాదుల స్వీకరణ కోసం సెల్, ప్రతి బుధవారం ట్రైబల్ వెల్ఫేర్ కోర్టు ఏర్పాటును స్వాగతిస్తున్నాము. అలాగే ట్రైబల్ న్యాయవాదులతో కూడిన ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చెయ్యకపోతే ఎల్.టి.ఆర్ కేసుల పరిష్కారంలో తాత్సారం చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. గిరిజన ఫిర్యాదుదారులకు తగిన న్యాయం జరగాలంటే ట్రైబల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## భారీ వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కారణంగా ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన కారణంగా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశమునందున వాగులు వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున వాగులు మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో వాగులు తగ్గేవరకు వాగులు దాటవద్దని ఆయన అన్నారు.ఈ భారీ వర్షాలు కారణంగా పర్యాటక ప్రాంతాలు వర్షాలు తగ్గేవరకు మైదాన ప్రాంతాల నుండి వచ్చే పర్యటకులు పర్యటక ప్రాంతాలకు రావద్దని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా ఎక్కడైనా వరదల్లో బాధపడుతున్న వారు కంట్రోల్ రూమ్ నెంబర్ 08864242114కు సంప్రదించవచ్చని ఆయన అన్నారు.

## మండల టీడీపీ ఎస్టీ కమిటీ అధ్యక్షుడిగా సోదే వెంకన్న దొర




**దేవిపట్నం, అక్టోబర్ 25:(తెలుగురాష్ట్రం విలేఖరి):** రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ఆదేశాల మేరకు దేవీపట్నం మండల అనుబంధ సంఘాల ఎస్టీ కమిటీ సభ్యులను నియమించడం జరిగిందని మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. అధ్యక్షునిగా సోదే వెంకన్న దొర నియమితులయ్యారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన కార్యదర్శిగా కోండ్ల చిరంజీవి రెడ్డి, ఉపాధ్యక్షులుగా మిర్తివాడ వీరబాబు, సోమల వెంకటరామిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోయిన రాజేష్ రెడ్డి, తుర్రం బాపన్న దొర కొండ్ల రామకృష్ణారెడ్డి, కార్యదర్శులుగా కందికొండ గౌరీశ్వరి, చవలం కుమార్ రాజు, మడకం వెంకన్న బాబు, సభ్యులుగా ఇరేటి శివ పార్వతి, కారం సత్యనారాయణ, జమ్మి కవిత, చెదల ప్రసాద్ రెడ్డి, కలుమ్ తమన్న దొర నియమించామని తెలియజేశారు. ఈ నియామకాల పట్ల నూతనంగా నియమితులైన సభ్యులందరూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి, నియోజవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మండల నాయకులు అందరికి కూడా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. అంతేకాకుండా టిడిపి పార్టీకి, మాకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, పార్టీ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకొని వెళ్తు అందరికి అందుబాటులో ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు, తైలం గంగాధర్, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జొన్నలు రాంబాబు (నాని), కేశవరపు చంద్ర కుమార్(పండు), మాజీ తెలుగు యువత కార్యదర్శి చవలం శివరామకృష్ణ, అడబాల వీరభద్రరావు, జొన్నల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ పల్లపాటి నాగేశ్వరరావు, పేరుగాని ఏసు, ఈరేటి బ్రహ్మాజీరావు, ఈత శివాజీ చారపు రాంబాబు, కాసాని వెంకటేశ్వరరావు, మట్ట నరసింహమూర్తి(కాపు), కొత్తపల్లి అన్నవరం, కారం పోచమ్మ, పుట్టపల్లి మల్లేష్, కర్రి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్**



**తాడేపల్లిగూడెం, అక్టోబర్25 (తెలుగురాష్ట్రం విలేకరి):** తుఫాన్ ప్రభావంతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. మంతా తుపాన్ ఆంధ్రా వైపు దూసుకొస్తుందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని ఆయన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు, ప్రజానీకానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రకృతి వైపరీత్యాలను ధీటుగా ఎదుర్కొనేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలని వివరించారు.

## వైకాపా కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన రఘురాం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్25 (తెలుగురాష్ట్రం విలేకరి):** అప్పారావుపేట శివారు గొల్లగూడెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరసిక నాగరాజు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను వైకాపా రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు శనివారం పరామర్శించారు. కోరసిక ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేషు లత, ఎంపీటీసీ సభ్యుడు మార్లపూడి సుబ్బారావు, సబ్బితి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి తోడ్పాడాలి

## దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నగరంలోని వివిధ దేవాలయాలు, ధార్మిక సంస్థలకు సమర్థవంతమైన కమిటీలను వేయడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతన పాలక మండలి నియమించబడింది. మళ్ల వెంకట రాజు చైర్మన్ గా, కోలా రామచంద్రరావు, పెంద్యాల ఉమా మహేష్, నక్కెళ్ల హరి ప్రసాద్, వంజరపు శంకర్, సేలం సత్యనారాయణ, పానింగపల్లి సత్య శ్రీనివాస చార్యులు, తంగెళ్ల పద్మావతి, ఉప్పులూరి సూర్యకుమారి, కల్లూరి సూర్య నాగ వెంకట అన్నపూర్ణ, అరవ సువర్చల సంతోషి, కుప్పల రాజేశ్వరి డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారందరినీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు గన్ని కృష్ణ, చల్లా శంకరరావు, కాశీ నవీన్ కుమార్, వై శ్రీను, జామి సత్యనారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు. ఆలయం వద్ద టిడిపి నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి ఉన్నంత ప్రాధాన్యత మన ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఉందన్నారు. ప్రస్తుతం నగరంలో కూటమి సభ్యులను కలుపుకొని ఎండోమెంట్ కమిటీలను సమర్థవంతమైన సభ్యులతో వేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి కష్టాలను అధిగమించిన వారిని గుర్తించి అవకాశం ఇస్తున్నట్టు వివరించారు. కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 8 కమిటీలు ప్రమాణస్వీకారం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ అధినాయకత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు అధిక స్థాయిలో సేవింగ్స్ జరుగుతున్నాయన్నారు. గత వైకాపా మాదిరిగా కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు వెయ్యి రూపాయలు పెంచి ప్రతి నెల అందించడం జరుగుతుందన్నారు. సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతనంగా నియమించబడిన కమిటీకి స్వామి వారి సేవ చేసుకునే భాగ్యం దక్కిందని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ పాలక మండలి సభ్యులుగా నియమితులైన ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన వారు వచ్చి వివాహా కార్యక్రమాలు జరిపించుకుంటారని తెలిపారు. భక్తుల ఆలోచనలకు తగ్గట్టుగా పని చేయాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-కంట్రోల్ రూమ్ 9494060060 ఏర్పాటు**

**-కమిషనర్ రాహుల్ మీనా**




**రాజమహేంద్రవరం, అక్టోబర్ 25(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** దేశమంతా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 26 నుండి 29 వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల భద్రత రకోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడినట్లు కమిషనర్ రాహుల్ మీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరం లేని సందర్భంలో ఇళ్ల బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాల కారణంగా చెట్లు పడిపోవడం ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 9494060060 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నదిలో కార్తీక స్నానాలు చేయడం సురక్షితం కాదని. నది పొంగిపొర్లడం, ప్రవాహం ఎక్కువగా ఉండటం వంటి ప్రమాదాలు ఉంటాయన్నారు. ఈ పరిస్థితుల్లో నదిలో స్నానాలు చేయడం ప్రమాదకరం కావున భక్తులు సురక్షితమైన ప్రత్యామ్నాయాల కోసం చూడటం మంచిదని సూచించారు.

## రౌతుపాలెం - వంతాడ రోడ్డును పరిశీలించిన ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే సత్యప్రభ



**రౌతులపూడి, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రత్తిపాడు మండలంలో రౌతుపాలెం నుండి వంతాడ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ పరిశీలించారు. రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో, వాహనదారులు మరియు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజలు వివరించారు. పార్లమెంట్ సభ్యులు ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా స్వయంగా రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడి, రహదారి పూర్తిగా పునర్నిర్మాణం చేయడానికి తక్షణ చర్యలు ప్రారంభిస్తామని,ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టడం జరిగిందని ప్రజలకు తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ"మా ప్రభుత్వం ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు అందించడానికి కృషి చేస్తున్నాం అన్నారు. రౌతుపాలెం-వంతాడ రహదారి పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో స్కౌట్స్ పాత్ర కీలకం - డా. బి.వి. ప్రసాదరావు



**రావులపాలెం, అక్టోబర్ 25 ( తెలుగు రాష్ట్రం )** దేశ రక్షణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర అత్యంత కీలకమని లీడర్ ట్రైనీ (స్కౌట్, కబ్స్) డా. బి.వి. ప్రసాదరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కౌటింగ్ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందిస్తుందని తెలిపారు. పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న డీఈఓ డా. షేక్ సలీం బాషా, ఏపీసీ జి. మమ్మీ, క్యాంప్ కోఆర్డినేటర్ పి. రాంబాబులను అభినందించారు. క్యాంప్‌లో భాగంగా టెంట్లు వేయడం, నాటింగ్, ఫోక్ సాంగ్స్ తదితర అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. అనంతరం డా. ప్రసాదరావును దుశ్శాలువాతో సత్కరించారు.

## వాడపల్లి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ - త్వరలో పలు పనులకు శంకుస్థాపన






**వాడపల్లి, అక్టోబర్ 25 ( తెలుగు రాష్ట్రం )** కోనసీమ తిరుమల వాడపల్లి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులను ఆయన శుక్రవారం ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు, డీఈ ఉదయ్‌కుమార్, ఆర్కిటెక్ట్ సుబ్బారావు, దాతలు శ్రీరామరాజు, విశ్వనాథరాజు, కాయల జగన్నాథంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.1.5 కోట్ల వ్యయంతో సెంట్రలైజ్డ్ కిచెన్, డైనింగ్ హాల్, మినరల్ వాటర్ ప్లాంట్, గ్యాస్ యూనిట్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి పశ్చిమగోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి త్వరలో భక్తుల సేవలోకి తీసుకురావాలని సూచించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యంతో రావులపాలెం జాతీయ రహదారి నుంచి ఏటిగట్టు రోడ్డుకు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కంపార్ట్మెంట్, స్లాట్ విధానాలు, క్యూలైన్ షెడ్లు, టెన్సెల్ కవర్ల ఏర్పాటు ప్రణాళికలో ఉన్నాయని చెప్పారు. త్వరలో దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వాడపల్లి రానున్నారని, రూ.12 కోట్ల వ్యయంతో "శ్రీనివాసం" పేరుతో 54 రూములు, డార్మిటరీలు, రూ.1 కోటితో క్యూలైన్ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వాడపల్లి వారధి నుంచి సెంటర్ వరకు డబుల్ లైన్ రహదారి అభివృద్ధి అవకాశాలపై కూడా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

## కొత్తపేట లో ఉత్సాహంగా నాగుల చవితి వేడుకలు





**కొత్తపేట, అక్టోబర్ 25 ( తెలుగు రాష్ట్రం)** కొత్తపేట నియోజకవర్గంలో శనివారం నాగుల చవితి పండుగను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు, యువతులు పాలు, పసుపు, కుంకుమ, పూలు, నైవేద్యాలతో నాగదేవత ఆలయాలకు తరలివెళ్లారు. భూమాతకు ప్రతిరూపమైన నాగదేవతలను పూజిస్తూ కుటుంబ సౌఖ్యం, సంతానాభివృద్ధి, పశువుల ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేశారు. పలు ప్రాంతాల్లో నాగశిలలపై పాలు పోసి, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లోని నాగదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరులోని శ్రీ నాగేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, నైవేద్యాలు నిర్వహించారు. మహిళలు నాగదేవతలకు వ్రతం పాటించి కుటుంబ క్షేమం కోసం ఉపవాసం ఉండగా, చిన్నారులు నాగపాటలు పాడుతూ పండుగ ఉత్సాహాన్ని పెంచారు. పురోహితులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగుల చవితి పూజ ద్వారా సర్పదోషాలు తొలగి సౌఖ్యం చేకూరుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా ఈ పండుగ జరుపుకోవడం విశిష్టత అని వారు పేర్కొన్నారు.

అమలాపురం
అక్టోబర్ 26,
ఆదివారం 2025

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

## నాగుల చవితి రోజే నిండు గర్భిణీకి డోలిమోత.

**రోడ్డు లేనిది రోడ్డు%ౌ%కిలోమీటర్ నడకతో ప్రాణపయనం.**





**చింతపల్లి, అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** నాగుల చవితి పర్వదినాన బురదమామిడి గ్రామంలో ఆనందం కన్నీళ్లగా మారిపోయింది. వంచుర్బ రాములమ్మకు తొమ్మిది నెలలు నిండడంతో అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చాయి. మండలంలోని బలపం పంచాయతీ పరిధిలోని బురద మామిడి గ్రామానికి రహదారి సదుపాయం లేకపోవడంతో ఆమెను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లే మార్గం గ్రామస్తుల చేతిలో లేదు. పరిస్థితి అత్యవసరమని గ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెట్టు దిమ్మెతో డోలి కట్టి రాములమ్మను మోస్తూ అత్యవసరంగా తరలించే ప్రయత్నం ప్రారంభించారు. మట్టిరోడ్డు%ౌ%గుంతలు%ౌ%అడవులు%ౌ%పంట పొలాలు పండుగ రోజు ప్రాణాలతో పోరాటం, ప్రతి అడుగులో ప్రమాదం. సుమారు కిలోమీటర్ దూరం వరకు డోలి మోసుకుంటూ చెమటలు పట్టేంత వేదనతో ఆంబులెన్స్ చేరుకునేలా గ్రామస్తులు కలిసి పరిగెత్తారు. అనంతరం రాములమ్మను కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు శక్తివంచనలేక చికిత్స చేసినప్పటికీ, పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో రాములమ్మకు ప్రసవ చికిత్స అందిస్తున్నారు.

**రోడ్డు ఉంటే ప్రమాదం తప్పేదే.**

గర్భిణీ భర్త వంచుర్బ లక్ష్మణరావు మాట్లాడుతూ రోడ్డు ఉంటే నా భార్యకు ఇంతలా మోసుకురావాల్సిన పనిలేదు. ప్రతి సంవత్సరం ఇక్కడే ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతీసారి డోలి మోతే మా గ్రామానికి రవాణా. పండుగలు, ప్రసవాలు, అనారోగ్యం%ౌ%అన్నింటికీ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వాన్ని నీరసపరిచే నిర్లక్ష్యం.**

అత్యవసర సేవలు అందని దూర ప్రాంత గ్రామాలు ఇంకా ఉన్నాయన్న వాస్తవాన్ని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. ఏ చిన్న ఆలస్యం జరిగినా ప్రాణాపాయం తథ్యమేనని ప్రజలు అంటున్నారు. గ్రామస్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న రహదారి సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏపీలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్..

**ట్రావెల్స్ బస్సులపై 289 కేసులు**




**అమరావతి: అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా ఏపీలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాలపై విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై 289 కేసులు నమోదు చేశారు. 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి రూ.7.08 లక్షల జరిమానాలు విధించారు. అత్యధికంగా ఏలూరులో 55 కేసులు నమోదు చేశారు. 3 ట్రావెల్స్ బస్సులు సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు చేసి.. 4 బస్సులు సీజ్ చేశారు. కోనసీమ జిల్లాలో 27, చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12, విశాఖలో 7, నంద్యాలలో 4 కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేవని 8 బస్సులు, అత్యవసర ద్వారం లేదని 13 బస్సులపై కేసులు ఫైల్ చేశారు. అగ్నిమాపక పరికరాలు లేవని 103 బస్సులపై, ప్యాసింజర్ లిస్టు లేని కారణంగా 34 బస్సులపై, ఇతర ఉల్లంఘనలపై 127 కేసులు నమోదు చేశారు. ప్రత్యేక డ్రైవ్ రోజూ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## షెడ్యూల్ కులాల ఏరియాలో రోడ్లు డ్రైనేజీలు పనులు జరగలేదు



**ఏలూరు, అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ములగలంపాడు గ్రామం లోని కాలనీ ఎస్సీ ఏరియాలో ని రోడ్ల డ్రైనేజీలు లేవు.

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములగలంపాడు గ్రామం లోని కాలనీ ఎస్సీ ఏరియాలో ని రోడ్ల డ్రైనేజీలు పరిస్థితి. కూటమి ప్రభుత్వం మొదటిలో షెడ్యూల్ కులాలు రోడ్లు డ్రైనేజ్ ల అభివృద్ధికి సంబంధించి కొత్త గ్రాండ్స్ వచ్చిన షెడ్యూల్ కులాల ఏరియాలో రోడ్లు డ్రైనేజీలు పనులు జరగలేదని తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పిల్లలు బడికి వెళ్లి వచ్చేటప్పుడు ఏ ప్రమాదము జరుగుతుందో అని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలు లేక నీరు పోయే మార్గం లేదని దోమలలో పిల్లలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వస్తాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు అర్థం చేసుకుని ఈ కాలనీ సమస్యను పరిష్కరించాలని తెలిపారు.సంబంధిత పంచాయతీ అధికారులు గమనించి కాలనీ లోని మురికి నీరు వెళ్లేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సక్షం మోడల్ అంగన్వాడిగా రూపుదిద్దుకున్న అంతర్ల అంగన్వాడి కేంద్రం

**చిన్నారుల నవ్వులు ప్రకాశిస్తున్న విద్యా వెలుగు. గర్భిణీ స్త్రీలకి ఆరోగ్య భరోసా - గ్రామానికి గర్వకారణంగా మారిన సేవా కేంద్రం**





**చింతపల్లి, అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని అంతర్ల అంగన్వాడి కేంద్రం సక్షం మోడల్ అంగన్వాడిగా రూపు దిద్దుకొని గ్రామంలో ఆదర్శంగా నిలిచింది. పిల్లల ఎదుగుదలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, శుభ్రమైన వాతావరణం, పోషకాహారం, విద్యా కార్యక్రమాలు సమన్వితంగా అమలు కావడం ఈ విజయానికి మూలసూక్ష్మం. విద్యా రంగులతో మెరిసే గోడలు...పిల్లలకు పండుగ వాతావరణం. అంగన్వాడి కేంద్రం గోడలన్నీ విద్యాపరమైన చిత్రాలతో అలరారుతున్నాయి. అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ, అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణ వంటి మహనీయుల చిత్రాలు పిల్లల్లో జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాయి. కార్టూన్ పాత్రలు, జంతువులు, అక్షరాలు, సంఖ్యలు పిల్లల్ని ఆకట్టుకుంటూ ఆడుతూ నేర్చుకునే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. చిన్నారుల కోసం ఆట వస్తువులు, పుస్తకాలు, కబోర్డుల్లో శుభ్రంగా అమర్చిన విద్యా సామాగ్రి, బయటి ఆడుకునే ప్రదేశం అందుబాటులో ఉన్నాయి.

**పౌష్టికాహారం...ఆరోగ్యానికి బాట.**

గర్భిణీ స్త్రీలు, బాలింతలకు గోధుమ, రాగి, చెక్కెలు, బెల్లం, ఎండు ఖర్జూరం తో పాటు 3 కిలోల బియ్యం, 1 కిలో కందిపప్పు,, లీటర్ నూనె, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు. 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు 2.5 కిలోల బాలామృతం, 30 గుడ్లు, 6 లీటర్ల పాలు. ప్రతి నెలా అంగన్వాడి కేంద్రం పరిధిలో ఆరోగ్య దినోత్సవాలు, తల్లి–శిశు పోషణ అవగాహన, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది.

**ప్రీ-స్కూల్ విద్య...ఆటలతో నేర్చుకునే పద్ధతి.**

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యతో పాటు ఆటపాటలు, డ్రాయింగ్, వ్యక్తిత్వ అభివృద్ధి, ఆటల పోటీలు పిల్లలకు విద్యను ఆనందంగా మార్చుతున్నాయి. మధ్యాహ్నం ఉడికించిన గుడ్డు, ఆకుకూరలతో వంటకాలు. సాయంత్రం పాలు పంపిణీ చేస్తారు.

**కార్యకర్తల నిబద్ధతే విజయ రహస్యం.**

అంగన్వాడి కార్యకర్త పుట్టపల్లి నాగరత్నం, సహాయకురాలు రాజన్ రామతల్లి పిల్లల ఆరోగ్యం మరియు విద్యలో ఏ విషయంలోనూ రాజీపడకుండ కష్టపడి కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. మెరుగైన సదుపాయాలు తీసుకురాబోతున్నాము అని కార్యకర్తలు తెలిపారు.

**గ్రామానికి గర్వ క్షణం.**

అంతర్ల గ్రామ ప్రజలు స్థానిక మహిళా సంఘాలు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, అందరూ ఈ కేంద్రాన్ని అభినందిస్తున్నారు. గ్రామ పంచాయతీ కూడా అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి ముందుకు రావాలని గ్రామస్థులు కోరుతున్నారు.










## పిల్లలలో దృష్టిదోషాలను చిన్నతనంలోనే గుర్తిస్తే నివారించొచ్చు

**నేటి బాలలే రేపటి పౌరులు.. దేశ భవిషత్తు యువత చేతిలో ఉంది**

**కూటమి ప్రభుత్వం దృష్టిలో రాష్ట్ర భవిషత్తు అంటే మన పిల్లలు ఉజ్వల భవిషత్తే**

**సానా సతీష్ బాబు ఫౌండేషన్ - ఏలూరు టీమ్ ఆధ్వర్యంలో "చిన్నారి నేత్రాలు - సంరక్షణ" సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం-రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి.**



**ఏలూరు, అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** సానా సతీష్ బాబు ఫౌండేషన్ – ఏలూరు టీమ్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత కంటివైద్య పరీక్షలు మరియు కళ్ళజోళ్లు పంపిణీలో కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు స్థానిక ఆర్ఆర్ పేట శ్రీమతి ఈదర సుబ్బమ్మాదేవి నగర పాలక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం సానా సతీష్ బాబు ఫౌండేషన్ – ఏలూరు టీమ్ ఆధ్వర్యంలో "చిన్నారి నేత్రాలు – సంరక్షణ" సేవాకార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథులుగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి, విద్యార్థిని, విద్యార్థులకు కంటి పరీక్షలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పిల్లల్లో దృష్టి దోషాలను చిన్నతనంలోనే గుర్తిస్తే వెంటనే నివారించవచ్చని అన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతీ ఇంటిలోనూ స్మార్ట్ ఫోన్లు వాడకం ఎక్కువైందని, ఇంట్లో చిన్నపిల్లలకు వారి తల్లితండ్రులు స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉంచడంతో వాటితో పిల్లలు ఎక్కువసేపు గడుపుతున్నారని, దీనివల్ల వారిలో దృష్టి దోషాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, వారి ఆరోగ్య పరిరక్షణ తల్లితండ్రులు బాధ్యతన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల్లోని అనారోగ్య లక్షణాలను చిన్నతనంలోనే గుర్తించి, చికిత్స అందిస్తే వాటిని నివారించి వారికి ఉజ్జ్వల భవిష్యత్తు కల్పించిన వారవుతారన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యనతను ఇస్తున్నదని , ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఇటీవల మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందికి పైగా ఉపాధ్యాయులను నియమించిందన్నారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించి, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని ఆయా సబ్జెక్టులపై అవగాహన పెంచుతున్నామన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యపరిస్థితి, వారి అవసరాలు, తదితరాలను తెలుసుకుని వాటిని కల్పించడం జరిగిందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, గార్డెనింగు, పరిసరాలు పరిశుభ్రత, వంటి పాఠ్యేతర కార్యకలాపాలు పట్ల ఆసక్తి కలిగించాలన్నారు. ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. ఆయన స్ఫూర్తితో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఏలూరు జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు కంటి వైద్య పరీక్షలు, కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటువంటి మహత్తర మెగా ఉచిత వైద్యశిబిరాన్ని మొదటగా ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేయడం, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా జిల్లాలకు ఇటువంటి సదస్సులు నిర్వహించడానికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, సేవా సంస్థలు కార్యక్రమాలు జతకలిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు అంటే, మన పిల్లల భవిషత్తే నని అన్నారు. రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో సమూల మార్పులు చేపట్టారని అన్నారు. అభివృద్ధికి విద్య ఒక్కటే రాజమార్గమని విద్య వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రతి యువత ఉన్నత చదువులు వైపు అడుగులు వేసి, దేశ, రాష్ట్ర భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని అన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఏలూరు జిల్లా ఏలూరు నియోజకవర్గంలో విద్యార్థులకు కంటి పరీక్షలు, అవసరమైన వారికి కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమం చెయ్యడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో జాతిపిత గాంధీజీ, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్, పొట్టి శ్రీరాములు, ఈదర సుబ్బమ్మ దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి, మంత్రి కొలుసు పార్థసారథి, పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం. వెంకటలక్ష్మమమ్మ, నగరపాలక కో– ఆప్షన్ సభ్యులు యస్.యం.ఆర్. పెదబాబు, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన వాణి శివ ప్రసాదు, ఏపి యాదవ కార్పొరేషన్ డైరెక్టరు పెనుబోయిన మహేష్ కుమార్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా.ఏ.యస్.రామ్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ – ఏలూరు టీమ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పెంటపాడు బ్రిడ్జి వద్ద ఘోర ప్రమాదం.

**డివైడర్ ను ఢీకొన్న బైక్.. యువకుడు మృతి.**





**చింతపల్లి, అక్టోబర్ 25 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** పెంటపాడు బ్రిడ్జి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అల్లూరి జిల్లాలోని అడ్డతీగల మండలం సోములపాడు గ్రామానికి చెందిన వాసిరెడ్డి దావీదు (27) గత కొంతకాలంగా గూడెంకొత్త వీధి మండలం లక్కవరపుపేట పంచాయతీ పరిధిలోని సురవరం గ్రామంలో చంద్రు లక్ష్మణరావు అత్తమామల వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పనుల నిమిత్తం చింతపల్లి పట్టణానికి వచ్చిన దావీదు తిరుగు ప్రయాణంలో పెంటపాడు%–%రింతాడ గ్రామాల మధ్యనున్న బ్రిడ్జి వద్ద బైక్ వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఢీ బలానికి ద్విచక్రవాహనం దెబ్బతిని చిందరవందరగా పడిపోగా, దావీదుకు తీవ్రమైన తలగాయాలు అయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో మద్యం సేవించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం మత్తులో అధిక వేగమే ప్రమాదానికి కారణమై ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఏడాది చిన్నబాబు ఉన్నారు. యువకుడి అకస్మిక మరణంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సురవరం గ్రామం అంతటా శోకసంద్రం వ్యాపించింది. స్వల్ప నిర్లక్ష్యం ఎంత పెద్ద విషాదానికి దారితీస్తుందనే మరో ఉదాహరణగా ఈ సంఘటన నిలిచిపోయింది.

## మందేశ్వర స్వామి దేవస్థానంలో ధర్మకర్తల ఎన్నిక - అన్నప్రసాదం వితరణ




**మందపల్లి, అక్టోబర్ 25 ( తెలుగు రాష్ట్రం)** కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం విశేషమైన కార్యక్రమం జరిగింది. చిలకమర్తి వెంకట సూర్య సుబ్రహ్మణ్య శ్రీనివాస్, శ్రీమతి అనంత లక్ష్మీ సావిత్రి దంపతులు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుమార్తె ఐశ్వర్య భారతి చేతుల మీదుగా రూ.27,000 రూపాయలు అన్నదాన విరాళంగా సమర్పించారు. దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసి, శ్రీ స్వామి వారి శేషావస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు పాల్గొని, కొత్తగా ఎన్నికైన ధర్మకర్తల దంపతులను అభినందించారు.

## మంత్రి దుర్గేష్ పరామర్శ - జనసైనికుడు గణేష్ కుటుంబానికి ఓదార్పు

**చెముడులంక, అక్టోబర్ 25 ( తెలుగు రాష్ట్రం )** ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త సిద్దిరెడ్డి గణేష్ కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో గణేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. కడియం మండలం జనసేన కార్యకలాపాల్లో గణేష్ చురుకుగా వ్యవహరించేవారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. గణేష్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆప్యాయంగా మనోధైర్యం నూరిపోశారు. కార్యక్రమంలో కడియపులంక సొసైటీ అధ్యక్షులు గట్టి నరసయ్య, జనసేన పార్టీ నాయకులు పాఠంశెట్టి రవి, అడబాల వీర్రాజు, ఆదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



# రాణించిన రో-కో..



## మూడో వన్డేలో టీమ్ఇండియా ఘన విజయం

**సిడ్నీ వేదికగా మూడో వన్డేలో ఆస్ట్రేలియా, టీమ్ ఇండియా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారతజట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ తొలుత 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు శుభారంభం దక్కింది. శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ మొదటి వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. 24 పరుగుల వద్ద హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లీ తొలి బంతికే తన పరుగుల ఖాతా తెరిచాడు. మొదటి రెండు వన్డేల్లో వరుసగా డకౌట్ అయిన కోహ్లీ ఈ మ్యాచ్‌లో మాత్రం తన రిథమ్‌లోకి వచ్చాడు.**

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. రో- కో ధాటికి ఆసీస్ బౌలర్లు తేలిపోయారు. వీరు మూడో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగులు జత చేశారు. రెండో మ్యాచ్‌లో అర్ధ శతకం చేసిన రోహిత్ ఈ వన్డేలోనూ అద్భుతంగా రాణించి, సెంచరీ (105 బంతుల్లో) చేశాడు. 125 బంతుల్లో 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రోహిత్ శర్మకు ఓవరాల్‌గా ఇది 50వ సెంచరీ. వన్డేల్లో అతడికిది 33వ శతకం. ఆస్ట్రేలియాలో పర్యటిస్తూ ఆ జట్టుపై ఎక్కువ సెంచరీలు (6) చేసింది కూడా రోహిత్ శర్మనే. ఆ తర్వాతి స్థానంలో విరాట్ కోహ్లీ (5 సెంచరీలు) ఉన్నాడు.

ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ వన్డేల్లో రెండో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. ఇంతకు ముందు మూడోస్థానంలో ఉన్న కోహ్లీ.. ఈ మ్యాచ్‌లో కుమార సంగక్కరను (14234 పరుగులు) అధిగమించాడు. కోహ్లీ కంటే ముందు 18426 పరుగులతో సచిన్ తెందూల్కర్ ఉన్నాడు. సిడ్నీ వన్డేలో విరాట్ కోహ్లీ 56 బంతుల్లో తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 81 బంతుల్లో 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

రో- కో ద్వయం రాణించడంతో టీమ్ఇండియా, ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యాన్ని 38.3 ఓవర్లలోనే కేవలం ఒక వికెట్ కోల్పోయి ఛేధించింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ మాత్రమే ఒక వికెట్ పడగొట్టాడు. మిగతా బౌలర్లంతా తేలిపోయారు. అంతకు ముందు ఆసీస్ బ్యాటర్లలో మ్యాట్ రెన్‌షా (56), మిచెల్ మార్ష్ (41) రాణించారు. టీమ్ఇండియా బౌలర్లలో హర్షిత్ రాణా 4, సుందర్ 2.. సిరాజ్, కుల్‌దీప్, అక్షర్, ప్రసిద్ధ్‌కృష్ణ తలో వికెట్ తీశారు.



# గంభీర్ నమ్మకాన్ని నిలబెట్టిన 23 ఏళ్ల కుర్రాడు..

## ఆసీస్ పతనాన్ని శాసించిన హర్షిత్ రాణా



**ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియా జట్టులో యువ పేసర్ హర్షిత్ రాణా సెలక్షన్ పై అనేక విమర్శలు, ప్రశ్నలు వచ్చాయి. కానీ, సిడ్నీ వేదికగా జరిగిన మూడో వన్డేలో హర్షిత్ రాణా బంతితో సమాధానం చెప్పాడు. తన అద్భుతమైన ప్రదర్శనతో విమర్శకుల నోళ్లకు తాళం వేయడమే కాకుండా, ఆస్ట్రేలియాను మెరుగైన స్కోరుకు చేరకుండా అడ్డుకున్నాడు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో తన బౌలింగ్‌తో సంచలనం సృష్టించిన హర్షిత్ రాణా, తన వన్డే కెరీర్‌లోనే తొలిసారిగా 4 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో అతను కెప్టెన్ శుభమాన్ గిల్‌తో పాటు, తనను 23 ఏళ్ల కుర్రాడు అని సమర్థించిన ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నమ్మకాన్ని కూడా నిలబెట్టుకున్నాడు.**

ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో హర్షిత్ రాణా తన బౌలింగ్‌తో పెను ప్రకంపనలు సృష్టించాడు. అతను తన కోటాలోని మొత్తం 10 ఓవర్లు కూడా వేయలేదు. రాణా కేవలం 8.4 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి, 39 పరుగులు ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. హర్షిత్ రాణా.. అలెక్స్ కేరీ, మిచ్ ఓవెన్, కూపర్ కొనోలీ, జోష్ హేజిల్‌వుడ్ వంటి కీలక బ్యాటర్ల వికెట్లను తీశాడు. అతని కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా ఆస్ట్రేలియా భారీ స్కోరు చేయలేకపోయింది.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే వన్డే క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన హర్షిత్ రాణా, సిడ్నీలో ఆడిన మూడో వన్డేతో తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. ఇది హర్షిత్ రాణా ఆడిన 8వ వన్డే మ్యాచ్. ఈ మ్యాచ్‌లో అతను 4 వికెట్లు తీసి తన కెరీర్ బెస్ట్ ప్రదర్శనను నమోదు చేశాడు. అంతకుముందు వన్డేల్లో రాణా అత్యుత్తమ ప్రదర్శన 31 పరుగులకు 3 వికెట్లుగా ఉండేది. అంటే, తన వన్డే కెరీర్‌లో ఒక మ్యాచ్‌లో 4 వికెట్లు తీయడం ఇదే మొదటిసారి.

సిడ్నీలో 4 వికెట్లు తీయడంతో, హర్షిత్ రాణా వన్డే కెరీర్‌లో ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు అయ్యాయి. ఆస్ట్రేలియాపై జరిగిన ఈ వన్డే సిరీస్‌ను రాణా 3 మ్యాచ్‌లలో 6 వికెట్లు పడగొట్టి ముగించాడు. సిడ్నీలో అద్భుత ప్రదర్శన చేయకముందు, తొలి రెండు వన్డేలలో అతను కేవలం 2 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. చివరి మ్యాచ్‌లో చూపించిన ఈ ఫామ్ భారత జట్టుకు శుభసూచకం. భారత జట్టు చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్, ఆస్ట్రేలియా పర్యటనకు ముందు హర్షిత్ రాణాను 23 ఏళ్ల కుర్రాడు అని పేర్కొంటూ, విమర్శల నుండి అతన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు సిడ్నీలో తన కళ్ల ముందు హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ చేసి తన వన్డే కెరీర్‌లో మొదటిసారిగా 4 వికెట్లు తీయడం చూసిన గంభీర్, ఖచ్చితంగా చాలా సంతోషించి ఉంటాడు. అతని నమ్మకాన్ని ఈ యువ పేసర్ నిలబెట్టుకున్నాడు.

# పాక్ క్రికెట్‌లో ఇదేం విచిత్రం?

## కెప్టెన్‌గా తప్పించి డైరెక్టర్ పదవి!

**పాకిస్థాన్ క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాదు. సీనియర్లను ఒక్కసారిగా పక్కన పెట్టేస్తారు. మళ్లీ ఎందుకు జట్టులోకి తీసుకుంటారో కారణం ఉండదు. కెప్టెన్లను మారుస్తూ ఉండటం పాక్ మేనేజ్‌మెంట్‌కు అలవాటు. ఇక పాక్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ తీరు మరీ వివాదాస్పదం. ఇప్పుడు మరో సంచలన నిర్ణయంతో క్రికెట్ ప్రపంచం ఆశ్చర్యపోయింది.**



సాధారణంగా కొన్నేళ్లపాటు జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాడు రిటైర్‌మెంట్ తీసుకోవడం పరిపాటి. ప్రతి క్రికెట్ బోర్డులోనూ ఇలాగే జరుగుతుంది. కానీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో మాత్రం అలా కాదు. తాము అనుకుంటే అప్పటికప్పుడు జట్టు నుంచి తప్పించి బోర్డు పదవి ఇచ్చేస్తుంది. దానికి ప్రత్యక్ష ఉదాహరణ షాన్ మసూద్. అతడు కేవలం 44 టెస్టులు, 9 వన్డేలు, 19 అంతర్జాతీయ టీ20లు మాత్రమే ఆడాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో రెండో మ్యాచ్‌ను ఓడిపోవడంతో సారథ్యం నుంచి మసూద్ వైదొలిగాడు. ఆ వెంటనే అతడికి పీసీబీ డైరెక్టర్ పదవిని ఇస్తూ మోసిన్ నఖ్వీ ప్రకటించడం గమనార్హం. ఈ పోస్టు కోసం ఇప్పటికే దరఖాస్తులను కూడా పీసీబీ ఆహ్వానించింది. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంది. 36 ఏళ్ల షాన్ మసూద్ అంతర్జాతీయ క్రికెట్ డైరెక్టర్‌గా ఉస్మాన్ వహ్లా స్థానంలో కొత్తగా నియమితులయ్యాడు. ఆసియా కప్ సమయంలో.. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ విషయంలో స్పందించిన తీరు సరిగా లేదనే కారణంతో ఉస్మాన్‌ను పీసీబీ తప్పించింది.

### నఖ్వీపై ఇప్పటికే విమర్శలు..

ఆసియా కప్‌ను గెలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకపోవడంతో మోసిన్ నఖ్వీ తీరుపై అంతర్జాతీయంగా తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ట్రోఫీని ఇవ్వకుండా తనతోపాటు తీసుకెళ్లడంపై బీసీసీఐ నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. అయినా సరే మొండిపట్టు వీడకుండా నఖ్వీ అలానే వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ట్రోఫీని తనకు మాత్రమే తెలిసిన ప్రదేశంలో దాచి ఉంచినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో జరిగే ఐసీసీ సర్వసభ్య సమావేశంలో ఇదే ప్రధాన అంశంగా మారే అవకాశం లేకపోలేదు.

# ఇండోర్‌లో షాకింగ్ ఘటన..

## ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లపై వేధింపులు.. వ్యక్తి అరెస్ట్

**ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచ్ కోసం ఇండోర్‌కు వచ్చిన ఆస్ట్రేలియా మహిళల జట్టు క్రికెటర్లకు చేదు అనుభవం ఎదురైంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఒక మోటార్‌సైకిల్‌పై వచ్చిన వ్యక్తి, ఆస్ట్రేలియాకు చెందిన ఇద్దరు క్రికెటర్లను వేధించడంతో పాటు, వారిలో ఒకరిని లైంగికంగా వేధించిన సంఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటన గురువారం ఉదయం ఖజ్రానా రోడ్‌లో జరిగిందని, జట్టు ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు తక్షణమే అరెస్టు చేశారు. దేశంలో కీలకమైన ప్రపంచ కప్ టోర్నమెంట్ జరుగుతున్న సమయంలో విదేశీ క్రీడాకారిణుల పట్ల ఇలాంటి దుశ్చర్య జరగడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**



ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు ఇండోర్‌కు వచ్చిన ఆస్ట్రేలియా మహిళా జట్టుకు చెందిన ఇద్దరు క్రికెటర్లు గురువారం ఉదయం ఈ వేధింపులను ఎదుర్కొన్నారు. ఖజ్రానా రోడ్ వెంబడి ఉన్న హోటల్ నుండి బయటికి వచ్చి సమీపంలోని ఒక కేఫ్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఒక వ్యక్తి వారిని వెంబడించడం ప్రారంభించాడు. ఆ తర్వాత వారిలో ఒక క్రికెటర్‌ను అనుచితంగా తాకి అక్కడి నుంచి పారిపోయాడు.

ఆటగాళ్లు వెంటనే తమ జట్టు భద్రతా అధికారి డానీ సిమ్మన్స్‌కు ఈ విషయం తెలియజేశారు. ఆయన వెంటనే స్థానిక భద్రతా అధికారులను సంప్రదించి, వారికి సహాయం అందించడానికి వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఘటన గురించి ఫిర్యాదు అందిన వెంటనే ఏసీపీ హిమానీ మిశ్రా ఆటగాళ్లను కలిసి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఎంఐజీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సమయంలో దగ్గరలో ఉన్న ఒక వ్యక్తి ఆ మోటార్‌సైకిల్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను నోట్ చేసుకున్నాడు. ఈ నంబర్ ఆధారంగా పోలీసులు నిందితుడైన అఖిల్ ఖాన్ను శుక్రవారం నాడు గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఖాన్‌పై గతంలో కూడా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు జరుగుతోంది. ఈ వార్త ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికాతో తమ చివరి గ్రూప్-దశ మ్యాచ్ ఆడటానికి కొన్ని గంటల ముందు వెలువడింది. ఈ మ్యాచ్ ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా రెండూ సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించాయి. అయితే, ఈరోజు జరిగే మ్యాచ్ ఫలితం గ్రూప్-ఏలో టేబుల్ టాపర్‌ను నిర్ణయిస్తుంది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 11 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా 10 పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా మహిళల జట్టు గెలిస్తే, వారు అగ్రస్థానంలో నిలుస్తారు.. లేదంటే ఆస్ట్రేలియానే టేబుల్ టాపర్‌గా కొనసాగుతుంది. ఈ మ్యాచ్ భారత మహిళల జట్టుకు కూడా చాలా కీలకం, ఎందుకంటే గ్రూప్ ఛాంపియన్‌గా నిలిచిన జట్టుతోనే భారత జట్టు సెమీ-ఫైనల్‌లో తలపడుతుంది.

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# 'బాహుబలి' రీ రిలీజ్.. సరికొత్త ట్రైలర్ ..!





హైదరాబాద్ : ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సఅష్టించిన దృశ్య కావ్యం 'బాహుబలి' మరోసారి వెండితెరపై మాయ చేసేందుకు సిద్ధమైంది. సినిమా విడుదలై పదేళ్లు కావొస్తున్న సందర్భంగా %ొ% రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే చిత్రంగా ఈ నెల 31న రీ రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా సరికొత్త ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇది సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈసారి కేవలం పాత సినిమాను మళ్లీ ప్రదర్శించడమే కాకుండా, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సాంకేతికంగా ఎన్నో మార్పులు చేశారు. అత్యాధునిక ప్రీమియం ఫార్మాట్లయిన ఐమాక్స్, 4డీఎక్స్, డాల్బీ సినిమాలలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. రీమాస్టర్ చేసిన పిక్చర్, అద్భుతమైన సౌండ్ క్వాలిటీతో 'బాహుబలి' ప్రపంచాన్ని మునుపెన్నడూ చూడని విధంగా బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించే అవకాశం కలగనుంది. రెండు భాగాలను కలిపి రూపొందించిన ఈ సింగిల్ వెర్షన్ నిడివి 3 గంటల 44 నిమిషాలుగా ఖరారు చేశారు. ఇప్పటికే ఈ వెర్షన్ సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకుంది. ఒక దశాబ్దం తర్వాత తమ అభిమాన సినిమాను ఐమాక్స్ వంటి ఆధునిక సాంకేతిక ఫార్మాట్‌లో చూసేందుకు సినీ ప్రియులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ విడుదల



రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక హీరోయిన్‌గా రాబోతున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 7వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో తాజాగా అక్టోబర్ 25న ఈ చిత్రం ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. 'ట్రెండింగ్ లో ఉన్న అంశాలను తెరకెక్కించాలి అనే ఆలోచనను పక్కన పెట్టి ఒక మంచి కథతో నేను మీ ముందుకు వచ్చాను. సాధారణంగా రిలేషన్‌లో ఉన్న వారు ఎవరైనా సరే ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజ జీవితాలకు దగ్గరగా ఉంటుంది. నా టీం సపోర్ట్ వల్లే ఈ సినిమాను ఈరోజు నేను మీ ముందుకు తీసుకురాగలుగుతున్నాను. 13 ఏళ్ల నుంచి నేను ఈ కథ గురించి ఆలోచిస్తున్నాను. నేను హాస్టల్లో ఉన్నప్పుడు జరిగిన ఒక చిన్న సంఘటన ఈ సినిమాకు పునాది వేసింది. గత ఐదు సంవత్సరాల క్రితమే దానిని స్క్రీన్ ప్లేగా రాసుకున్నాను. ఇన్ని రోజులకు ఈ చిత్రం మీ ముందుకు వచ్చింది' అని తెలిపారు. రష్మిక లీడ్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి కీలకపాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్ రష్మిక తండ్రి పాత్రలో నటిస్తుండగా.. అను ఇమ్మానుయేల్ మరో హీరోయిన్‌గా చేస్తున్నారు.

# బాలీవుడ్ నటుడు సతీష్ షా కన్నుమూత




ప్రముఖ బాలీవుడ్ నటుడు సతీష్ షా(74) శనివారం మధ్యాహ్నం మరణించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. 'సారాభాయి వర్సెస్ సారాభాయి'(టెలివిజన్ షో), 'హమ్ సాత్ సాత్ హైనా', 'మైనే హూన్ నా', 'ఓం శాంతి ఓం' వంటి అనేక ప్రముఖ చిత్రాల్లో ఆయన నటనకి ప్రేక్షకాదరణ దక్కింది. సుమారు 4 దశాబ్దాలు చిత్రసీమలో టెలివిజన్ షోలలో ఎన్నో పాత్రలు పోషించారు. చిత్రసీమ ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపింది.



# శివ' రీ రిలీజ్.. రెండు లారీల పేపర్లు..

రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగార్జున హీరోగా నటించిన 'శివ' చిత్రం 36 ఏళ్ల తరువాత ఈ నవంబర్ 14న రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రముఖులు, దర్శకులు 'శివ' తమ జీవితంపై చూపిన ప్రభావం గురించి పంచుకుంటున్నారు. శేఖర్ కమ్ముల, అశుతోష్ గోవారికర్ తమ అనుభవాలను వీడియోల రూపంలో పంచుకోగా, తాజాగా అల్లు అర్జున్ కూడా స్పెషల్ మెసేజ్ ఇచ్చారు. ఆ వీడియోలో బన్నీ మాట్లాడుతూ.. 'తెలుగు సినిమా చరిత్రలో 'శివ' ఒక ఐకానిక్ చిత్రం. ఆ ఒక్క సినిమా భారతీయ సినీ పరిశ్రమకు కొత్తదారులు చూపింది. మాస్, రియలిజం, టెక్నికల్ బ్రిలియన్స్ అన్నీ కలిపిన ఒక అద్భుతం అది. అలాంటి సినిమా మళ్లీ థియేటర్లలోకి వస్తుంటే ఆ వేడుకను గ్రాండ్‌గా జరుపుకోవాలి. అక్కినేని అభిమానులకే కాకుండా ప్రతి తెలుగు సినిమా ప్రియుడికి ఇది సెలబ్రేషన్ లాంటిది. ఈసారి థియేటర్‌కి వెళ్లేటప్పుడు రెండు లారీల పేపర్లు తీసుకెళ్లండి!' అని మాట్లాడారు.

# 'మా ఇంటి బంగారం' షూటింగ్



కథానాయిక సుమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. ఇందులో ఆమె గృహిణిగా నటిస్తున్నారు. సమంత పుట్టినరోజు సందర్భంగా 2024లోనే ఈ మూవీని అధికారికంగా ప్రకటించారు. షఉటింగ్ ప్రారంభించలేదు. ఈ వారంలోనే సినిమా చిత్రీకరణ వేగంగా జరుగుతుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా సినిమాకు నందినీరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో సినిమా షఉటింగ్ జరుగుతోంది. సమంత పాల్గొంటున్నారు. ఈ సినిమాలో నటించడంతో పాటు సమంత తన నిర్మాణ సంస్థ ట్రలాలా పిక్చర్స్‌పై నిర్మిస్తున్నారు.

# చిరంజీవికి అనుకూలంగా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు తీర్పు

- **నటుడు చిరంజీవి వ్యక్తిగత హక్కులకు కోర్టు రక్షణ**
- **అనుమతి లేకుండా పేరు, ఫొటో, వాయిస్ వాడకంపై నిషేధం**
- **ఏఐ టెక్నాలజీతో డీప్‌ఫేక్‌ల దుర్వినియోగానికి అడ్డుకట్ట**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం**
- **హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన చిరంజీవి**
- **ఇప్పటికే 30 మంది సోషల్ మీడియా యూజర్లకు నోటీసులు జారీ**



టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవికి చెందిన వ్యక్తిగత హక్కుల పరిరక్షణ విషయంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్ లేదా ఇతర వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించరాదని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఏఐ (AI) టెక్నాలజీతో సృష్టిస్తున్న డీప్‌ఫేక్‌లు, వాయిస్ క్లోనింగ్ వంటి దుర్వినియోగాలకు అడ్డుకట్ట వేసేలా ఈ తీర్పు వెలువడింది. కోర్టు ఆదేశాల ప్రకారం, చిరంజీవి పేరు, ఫొటో, గొంతుతో పాటు 'మెగాస్టార్', 'చిరు', 'అన్నయ్య' వంటి బ్రాండ్ పేర్లను కూడా అనుమతి లేకుండా వాడటంపై నిషేధం విధించింది. లాభాల కోసం లేదా టీఆర్పీ రేటింగ్స్ కోసం వీటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఇప్పటికే ఈ నిబంధనలు ఉల్లంఘించిన 30 మంది సోషల్ మీడియా యూజర్లు, కంటెంట్ క్రియేటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తే, సంబంధిత కంటెంట్‌ను వెంటనే తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంపై చిరంజీవి ఇటీవల హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. డిజిటల్ దుర్వినియోగాలను అరికట్టేందుకు చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా చర్చించారు. "నా ప్రతిష్ఠను, అభిమానుల మనోభావాలను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకున్నాను" అని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తనకు న్యాయపరంగా సహకరించిన అడ్వకేట్ ఎస్. నాగేశ్ రెడ్డి బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సెలబ్రిటీల వ్యక్తిగత హక్కుల పరిరక్షణలో ఈ తీర్పు ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. డిజిటల్ యుగంలో ఏఐ టూల్స్ ద్వారా పెరుగుతున్న ఫేక్ కంటెంట్ వ్యాప్తిని నియంత్రించేందుకు ఇలాంటి చట్టపరమైన చర్యలు ఎంతో అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఈ కేసు తదుపరి విచారణను కోర్టు అక్టోబర్ 27వ తేదీకి వాయిదా వేసింది.

# 'ఎల్లమ్మ'కు డిఎస్‌పి సంగీతం



'ఎల్లమ్మ' చిత్రంలో కథానాయకుడిగా మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. బలగం సినిమాతో డైరెక్టర్‌గా సూపర్ బ్రేక్ అందుకున్న వేణు యెల్దండి ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. కథానాయకుడి నటించటంతోపాటుగా ఆయనే సినిమా సంగీతాన్ని సైతం అందించటానికి ఒప్పుకున్నారని సమాచారం. అయితే బాలీవుడ్ మ్యూజిక్ ద్వయం అజయ్-అతుల్‌ను తీసుకుందామని నిర్మాత దిల్‌రాజు ఆలోచనలో ఉన్నారు. వేణు సూచనతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని సమాచారం. ఈ సినిమాలో కీర్తిసురేష్ కథానాయిక. నటీనటుల ఎంపిక కారణంగా ఇప్పటికే మొదలు కావాల్సిన ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతూ వస్తోంది. ఈ మూవీ తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో సాగనుంది. త్వరలో పూర్తివివరాలు వెల్లడిస్తామని నిర్మాతలుప్రకటించారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339